క్లుప్తంగా

స్వయం ఉపాధిపై యువతకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న శంకర్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రధాన మంత్రి కౌశల్ కేంద్రంలో స్వయం ఉపాధిపై శుక్రవారం సిర్పూర్ పేపర్ మిల్లు భారతీయ యువశక్తి (ట్రస్ట్) ప్రతినిధి శంకర్ యువతకు అవగాహన కల్పించారు. అవసరమైన సహాయ సహకారాలు ట్రస్ట్ తరపున అందిచనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఎంకేకే శిక్షణ కేంద్రం నిర్వాహకులు, అధ్యాపకులు నితేష్, సురేశ్, ట్రస్ట్ ప్రతినిధులు నిఖిల్, మంతెన శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం



ఎంపీడీవోను సన్మానిస్తున్న నాయకులు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నూతనంగా ఎంపీడీవో బాధ్యతలు స్వీకరించిన రమేశ్‌ను శుక్రవారం గిరిజన సంఘాల నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. గిరి గ్రామాల్లో ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీవో గంగాసింగ్, ఎంపీటీసీ రాజన్న, కమ్మర్‌గాం మాజీ సర్పంచ్ మధునయ్య, నాయకులు బాపురావు, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

అర్హులకు రూ.500లకే గ్యాస్



వివరాలు సేకరిస్తున్న ఎంపీడీవో

దహెగాం: అర్హులకు రూ.500లకే సిలిండర్‌ను ప్రభుత్వం అందజేస్తుందని ఎంపీడీవో రాజేశ్వర్ గౌడ్ అన్నారు. ప్రజాపాలనలో భాగంగా ఆరు గ్యారెంటీలకు దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరు ఆధార్, రేషన్ కార్డు, గ్యాస్ నంబర్లు తప్పుగా రాశారని, అలాంటి వారి జాబితా రూపొందించి శుక్రవారం విచారణ చేసినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ప్రణీత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మందులు, విత్తనాలు విక్రయిస్తే చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న శ్రీనివాస రావు

రెబ్బెన: ఫర్టిలైజర్ షాపుల్లో నకిలీ మందులు, విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస రావు హెచ్చరించారు. మండల కేంద్రంలోని పలు ప్రైవేటు ఫర్టిలైజర్ షాపులను శుక్రవారం తనిఖీ చేశారు. షాపుల్లో ఎరువులు, విత్తనాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని నకిలీ మందులు, విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

మల్టీ డిపార్టుమెంట్ కమిటీ సమావేశం



మాట్లాడుతున్న ఏరియా జీఎం రవిప్రసాద్

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం మల్టీ డిపార్టుమెంట్ కమిటీ అధికారులు సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెల్లంపల్లి ఏరియా జీఎం రవి ప్రసాద్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ నిజాయితీగా పని చేయాలని సూచించారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సింగరేణి సంస్థ ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా, ఉద్యోగులు, యంత్రాల పనితీరు వివరాలను వెల్లడించారు. ఇన్‌చార్జి ఎస్‌వోటూజీఎం ఉమాకాంత్, ఏజీఎం డీజీఎం ఉజ్వల్‌కుమార్ బెహేరా, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని తైబానగర్ వద్ద ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 4 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు పట్టణ ఎస్సై అంజయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తైబానగర్‌లో సోదాలు నిర్వహిస్తుండగా సంఘం బస్తీకి చెందిన షేక్ హమీద్ ఆటోలో బియ్యం తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.



దేవతలకు పూజలు చేస్తున్న కటోడాలు



అటుకులు, పుట్నాలు సమర్పిస్తున్న భక్తులు

'నాగోబా' కరుణించు..!



గంపలోని దేవతలకు మొక్కుతున్న భక్తులు



పాము ఆకారంలో బోర్లుకుంటూ ఆలయంలోకి వస్తున్న పూజారి బొజ్జు

కెరమెరి: మండలంలోని గోండ్ కరంజివాడలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో నాగోబాకు పూజలు చేశారు. ఉమ్మడి జిల్లాతోపాటు మహారాష్ట్రలోని చంద్రాపూర్, రాజురా, యవత్‌మాళ్, పాండర్‌కవ్‌డా తాలుకాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మొత్తం 25 మేశంలు వచ్చి పూజలు నిర్వహించారు. కుమురం బొజ్జు పటేల్ ఇంట్లో కొలువైన నాగోబాకు ఏడు రకాల నైవేద్యాలతో ఏడు సార్లు పూజలు చేశారు. బియ్యం, కొబ్బరికాయలు, పాలు, పెరుగు, బెల్లం, గోధుమలు, ఆవు నూనె తదితరాలను నైవేద్యంగా సమర్పించారు.

ఆసుపత్రిలో మందుల కొరత

- సిర్పూర్(టి) సామాజిక ఆసుపత్రికి సరఫరా కాని మందులు
- ఇండెంట్లు పంపుతున్నా పట్టించుకోని సీడీఎస్ అధికారులు
- ఇబ్బందులు పడుతున్న రోగులు



సిర్పూర్(టి) ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి

సిర్పూర్(టి): ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో మందుల కొరత పట్టి పీడిస్తోంది. ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో మందులు అందుబాటులో లేకపోవడంతో ఆసుపత్రికి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరిపడా మందులు లేక ఏం చేయాలో తోచని స్థితిలో ఆసుపత్రి సిబ్బంది అయోమయానికి గురవుతున్నారు. సిర్పూర్(టి) ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో గత సంవత్సరం అక్టోబర్ నుంచి పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉండటం లేదు. సామాజిక ఆసుపత్రిలో డ్రగ్స్, సర్జికల్, రీ ఏజెంట్స్ అనే మూడు విధాల మందులు అందుబాటులో ఉండాలి. కానీ ఒకటి ఉంటే మరొకటి లేకపోవడంతో సిబ్బంది రోగులకు మందులు సర్దలేక తిప్పలు పడుతున్నారు. ప్రతీ నెల సామాజిక ఆసుపత్రికి కావాల్సిన మందుల కోసం వైద్య సిబ్బంది మందుల ఇండెంట్లు సెంట్రల్ డ్రగ్ స్టోర్(సీడీఎస్)కు పంపిస్తున్నా సీడీఎస్ అధికారులు మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రతీ నెల రేపు, మాపు మందులు పంపిస్తామని చెబుతున్నారని ఆసుపత్రి సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇతర మండలాల నుంచి..

30 పడకల సిర్పూర్(టి) ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి మండలంలోని ప్రజలతో పాటు కౌటాల, బెజ్జూర్, చింతలమానెపల్లి తదితర మండలాల వాసులు ప్రతీరోజు వైద్య సేవల కోసం వస్తుంటారు. రోజుకు సుమారు 200 నుంచి 300 వరకు ఓపీ సేవలు అందిస్తున్నారు. రోగులకు ఆసుపత్రిలో సరిపడా మందులు అందుబాటులో ఉండకపోవడంతో నిరుపేదలు ప్రైవేటులో మందులు కొనుగోలు చేస్తూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

అందుబాటులో లేని మందుల వివరాలు..

ఆసుపత్రికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సీడీఎస్ నుంచి ప్రతీనెల అవసరమయ్యే మందులు సరఫరా చేయాల్సి ఉంటుంది. ఆసుపత్రి వైద్య సిబ్బంది ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్యతో పాటు ఇతర అవసరాలకు అవసరమయ్యే మందుల కోసం ప్రతీ నెల ఇండెంట్ పంపిస్తుండగా సీడీఎస్ నుంచి మందులు సరఫరా చేస్తుండేవారు. కానీ గత కొన్ని నెలలుగా మందుల కోసం ఇండెంట్లు పంపిస్తున్నా ఆసుపత్రికి సరిపడా మందులు మాత్రం రావడం లేదు. డ్రగ్స్ జనవరి మొదటి వారంలో రాగా ఫిబ్రవరిలో ఇంకా సరఫరా చేయలేదు. సర్జికల్స్ గత సంవత్సరం అక్టోబర్ నుంచి ఇండెంట్లు పంపిస్తుండగా ఫిబ్రవరి వరకు సరఫరా చేయలేదు. రీ ఏజెంట్స్ సైతం జనవరి వరకు మాత్రమే సరఫరా చేయగా ఫిబ్రవరిలో ఇంకా పంపించలేదు. అక్టోబర్ నుంచి ఆసుపత్రిలో సిరంజీలు, ఐవీ సెట్స్, ఐవీ క్యాన్‌లాలు పూర్తిగా షాటేజ్ కావడంతో రోగులకు వైద్య సేవలందించేందుకు వైద్యులకు ఇబ్బందులు తప్పడంలేదు. సీడీఎస్ అధికారులకు ఇండెంట్లు పంపించి ఫోన్ ద్వారా సంప్రదిస్తున్నా పట్టించుకోవడం లేదు.

ఉన్న మందులతోనే..



ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి ప్రతీరోజు వందల సంఖ్యలో రోగులు వైద్య సేవల కోసం వస్తుంటారు. సకాలంలో మందులు అందుబాటులో లేకపోవడంతో తిప్పలు తప్పడం లేదు. మందులు లేవని సిబ్బంది చెప్పడంతో చేసేదేమి లేక ఉన్న మందులతోనే సర్దుకుంటున్నాం. ఉన్నతాధికారులు స్పందించి ఆసుపత్రికి మందులు సకాలంలో సరఫరా చేయాలి.

– పైడి నానాజి, సిర్పూర్(టి)

సకాలంలో సరఫరా చేయాలి



ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో నాలుగు నెలలుగా మందులు అందుబాటులో ఉండడం లేదు. సామాజిక ఆసుపత్రులకు మందులు సరఫరా చేసే సీడీఎస్ అధికారులు నిర్లక్ష్యం వహించకుండా ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రతీ నెల ఇండెంటు ప్రకారం మందులు సరఫరా చేయాలి. మందులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

– నేరెళ్ల అశోక్, సిర్పూర్(టి)

ప్రతీ నెల ఇండెంట్లు పంపిస్తున్నాం



ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి వచ్చే రోగుల ప్రకారమే సీడీఎస్‌కు ప్రతీ నెల ఇండెంట్లు పంపిస్తున్నాం. సీడీఎస్ నుంచి సరఫరా చేయడంలో జాప్యం జరుగుతుండటంతో ఆసుపత్రిలో మందులు అందుబాటులో ఉండటంలేదు. మళ్లీ ఇండెంట్లు పంపించి మందులు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటాం.

– జోగేందర్, వైద్యుడు, సిర్పూర్(టి) ఆసుపత్రి

భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేయాలి



జాతర స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటరమణ

రెబ్బెన: మాఘ శుద్ధ పౌర్ణమి పురస్కరించుకొని గంగాపూర్‌లోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగనున్న జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని డీఎస్పీ వెంకటరమణ సూచించారు. శుక్రవారం ఆలయాన్ని సందర్శించి జాతర ఏర్పాట్లపై ఆరా తీశారు. జాతర సందర్భంగా భక్తులు తరలివచ్చే రహదారులను, ఆలయ పరిసరాలను పరిశీలించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా దారి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. జాతరలో ప్రధానమైన స్వామి వారి రథోత్సవం రోజున ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. మండల కేంద్రంలోని రైల్వే గేట్ వద్ద భక్తుల వాహనాల రద్దీతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ చిట్టిబాబు, ఆలయ ఈవో బాపిరెడ్డి, ఎస్సై చంద్రశేఖర్, బీఆర్ఎస్ నాయకులు పందిర్ల మదునయ్య, బీజేపీ నాయకులు సంజీవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పూదరి హరీశ్ పాల్గొన్నారు.

జిల్లా కమిటీ సమావేశాన్ని జయప్రదం చేయాలి

వాంకిడి: జిల్లా కేంద్రంలోని ఎస్ఎమ్ గార్డెన్స్‌లో ఈ నెల 13వ తేదీన నిర్వహించే టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ విస్తృత సమావేశాన్ని విజయవంతం చేయాలని సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు జాదవ్ సుభాశ్, బండె హరీష్ పిలుపునిచ్చారు. ఉదయం నిర్వహించే విద్యా సదస్సు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగయ్య, గౌరవ అతిథులుగా డీఈవో పార్శి అశోక్, డీటీడీవో రమాదేవి హాజరు కానున్నట్లు తెలిపారు.

'బొగ్గు బ్లాకుల వేలం నిలిపివేయాలి'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రెబ్బెన: సింగరేణి బొగ్గు బ్లాకుల వేలాన్ని వెంటనే నిలిపివేసి బ్లాకులను సింగరేణి సంస్థకే అప్పగించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. శుక్రవారం గోలేటి సీహెచ్‌పీలో కార్మికులతో కలిసి సమ్మె వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వేలంలో సింగరేణి యాజమాన్యం పాల్గొనేలా ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న జరగబోయే దేశ వ్యాప్త కార్మిక సమ్మె గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. ఏఐటీయూసీ నాయకులు స్వామి, లక్ష్మీనారాయణ, తిరుపతి, సత్తయ్య, శ్రీనివాస్, తిరుపతి, రవి తదితరులు పాల్గొన్నారు.

'కార్మికుల సంక్షేమం పట్టని బీజేపీ'



మాట్లాడుతున్న రాజేందర్

కెరమెరి: బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేళ్లు దాటుతున్నా కార్మికుల సంక్షేమంపై శ్రద్ధ చూపడం లేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పోరాడి సాధించుకున్న 44 చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులను బానిసలుగా చేసే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. కేంద్రం తీరుకు నిరసనగా ఈనెల 16న చేపడుతున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కూటికల ఆనందరావు, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

పంటల వివరాలు నమోదు చేయాలి



పంటలను పరిశీలిస్తున్న అధికారులు

కౌటాల: యాసంగిలో సాగు చేస్తున్న పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మండల వ్యవసాయాధికారి పాలకుర్తి రాజేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని గుండాయిపేట్ గ్రామంలోని యాసంగి పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించి రైతులు పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. యాసంగిలో సాగు చేసిన పంటల వివరాలను రైతులు ఏఈవోల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. పంటల వివరాలు నమోదు చేస్తే పంటలను సులువుగా అమ్ముకోవచ్చన్నారు. ఆయన వెంట ఏఈవో చౌదరి అంజన్న, రైతులు ఉన్నారు.

అమ్మవారి సన్నిధిలో ఆదివాసీల పూజలు



దర్శించుకుంటున్న ఆదివాసీ మహిళలు

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనక దుర్గాదేవీ, స్వయంభూ మహంకాళి ఆలయాన్ని శుక్రవారం అమవాస్య సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. జంగుబాయి మాలను స్వీకరించిన ఆదివాసీ మహిళలు అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న నాగదేవత విగ్రహాన్ని దర్శించుకున్నారు. అమ్మవారి ముందు నిమ్మకాయ దీపాలు, పిండి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు దేవార వినోద్ భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: రాష్ట్రంలో నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్న రెండో ఏఎన్‌ఎంలు, యూపీహెచ్ ఏఎన్‌ఎంలను బేషరతుగా రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో డీఎంహెచ్‌వో తుకారాం భట్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిరంజీవి, రెండో ఏఎన్‌ఎం సంఘం రాష్ట్ర నాయకులు వసంత, జిల్లా కోశాధికారి సునీత, నాయకులు లీల, సత్తమ్మ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

కాగజ్‌నగర్‌రూరల్: ప్రభుత్వాలు మారుతున్నా విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఓయూ జేఏసీ విద్యార్థి రాష్ట్ర కార్యదర్శి అన్నం నాగార్జున విమర్శించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అనేక పోరాటాల ఫలితంగా ఏర్పడిన రాష్ట్రంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీఎంబర్స్‌మెంట్ లేక విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజులను విడుదల చేయడంతో పాటు విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేని పక్షంలో విద్యార్థుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట సాయి, రాజశేఖర్ ఉన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే పీఆర్టీయూ ధ్యేయం

కాగజ్‌నగర్‌రూరల్: ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా పీఆర్టీయూ పని చేస్తుందని సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎటుకూరి శ్రీనివాస్, ఆడె ప్రకాశ్‌లు అన్నారు. శుక్రవారం పీఆర్టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 75వేల మంది సభ్యత్వంతో సంఘం రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు.

జిల్లాకేంద్రంలో..

ఆసిఫాబాద్‌రూరల్: పీఆర్టీయూ ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తుందని సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సంఘం ఆవిర్భావం సందర్భంగా జిల్లా కేంద్రంలో జెండా ఎగురవేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాశ్, నాయకులు శంకర్, విజయ్, సంతోష్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్ సద్వినియోగం చేసుకోండి

కెరమెరి: మండల కేంద్రాల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 18న నిర్వహిస్తున్న ఎస్సెస్సీ టాలెంట్ టెస్ట్‌ను పదో తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు షేక్ జాఫర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గోయగాం ఉన్నత పాఠశాల, ఆశ్రమ ఉన్నత పాఠశాల హట్టి, మోడి, కేజీబీవీలలో టాలెంట్ టెస్ట్ పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు భీంరావు పాల్గొన్నారు.

11న గురుకుల ప్రవేశ పరీక్ష

ఆసిఫాబాద్‌రూరల్: టీజీసెట్ గురుకుల ప్రవేశ పరీక్ష ఈ నెల 11న నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష రాసే విద్యార్థులు పరీక్ష సమయం కంటే గంట ముందు రావాలని తెలిపారు. పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుందన్నారు.

విద్యుత్ సిబ్బందికి సహకరించాలి

వాంకిడి: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన గృహజ్యోతి పథకం అమలులో భాగంగా వినియోగదారుల వివరాల నమోదు చేసేందుకు వచ్చే విద్యుత్ సిబ్బందికి సహకరించాలని మండల విద్యుత్ శాఖ ఏఈ శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం మండలంలోని బెండార గ్రామంలో విద్యుత్ వినియోగదారుల వివరాలు సేకరించి మొబైల్ యాప్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు తమ రేషన్ కార్డు, ఆధార్ కార్డు వివరాలు విద్యుత్ సర్వీస్ నంబరుతో లింక్ చేయించుకోవాలని సూచించారు. ఏవో ఈశ్వర్, ఏఏవో తుకారాం, సిబ్బంది సురేశ్, సతీశ్ పాల్గొన్నారు.

12న టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సమావేశం

ఆసిఫాబాద్‌అర్బన్: తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం (టీయూడబ్ల్యూజే –ఐజేయూ) జిల్లా కార్యవర్గ సమావేశాన్ని ఈనెల 12వ తేదీన జిల్లా కేంద్రంలోని ఎస్ఎం ఫంక్షన్ హాల్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు 'పది' విద్యార్థులకు ప్రేరణ

కౌటాల: మండలంలోని పదో తరగతి విద్యార్థులకు వేకువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రేరణ ప్రాజెక్ట్ ద్వారా శనివారం ప్రేరణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంఈవో సోమయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని జగదాంబ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఉదయం 9.30 గంటలకు సీనియర్ మోటివేషనల్ స్పీకర్స్ విద్యార్థులకు మోటివేషన్ కల్పిస్తారని తెలిపారు.

23వ సారి రక్తదానం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని రాస్పల్లి గ్రామానికి చెందిన వర్ల సులోచన ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా శుక్రవారం బాధిత మహిళలకు విజయ్ బ్లడ్ ఫౌండర్ సంస్థ ద్వారా దాత విజయ్ రక్తదానం చేశారు. ఇప్పటికీ 23సార్లు రక్తదానం చేసినట్లు ఆయన తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత

కాగజ్‌నగర్‌రూరల్: బెల్లంపల్లి పట్టణానికి చెందిన హమీద్ ఈస్‌గాం నుంచి బెజ్జూర్ ప్రధాన రహదారిలో శుక్రవారం తన మొబైల్ ఫోన్ పాగొట్టుకుని ఈస్‌గాం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఏఎస్సై హీరామన్ సీఈఐఆర్ పోర్టల్‌లో మొబైల్ ట్రేస్ చేసి పోయిన ఫోన్‌ను గుర్తించి బాధితునికి అప్పగించారు.

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి



సన్మానిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: పోలీసు అధికారులు ఎక్కడ పని చేసినా క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ఆసిఫాబాద్ సీఐ రాజు, నరేందర్‌లు బదిలీపై వెళ్తున్న సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగంలో బదిలీలనేవి సహజమన్నారు. అదనపు ఎస్పీ అచ్చేశ్వర్‌రావు, డీఎస్పీలు వెంకటరమణ, కరుణాకర్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.